సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 10 । జూన్ । 2025



దొంగల ముఠా అరెస్ట్

తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు చేస్తూ, జాతీయ రహదారిపై దోపిడీలకు పాల్పడు తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.6 /19.6

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశా లున్నాయి.

న్యూస్‌రీల్

విత్తనాల కొరత లేకుండా చూడాలి



కామారెడ్డి క్రైం: విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, పంటల సాగులో అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

11న అపోలో ఫార్మసీ ఉద్యోగాలకు జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: అపోలో ఫార్మసీ కంపెనీలో ఉద్యోగాల కల్పన కోసం బుధవారం కలెక్టరేట్‌లోని 121 నంబర్ గదిలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డి ఫార్మసీ, బి ఫార్మసీ, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు సైతం ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 82476 56356, 76719 74009 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : దివ్యాంగులకు వీల్‌చైర్లు, బ్యాటరీ మూడు చక్రాల సైకిల్, బ్యాటరీ ఆటో, హైబ్రిడ్ వీల్ చైర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లు, బ్రెయిలీ పుస్తకాలను ఉచితంగా అందించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎ.ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైనవారు ఈనెల 18వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎంపిక కమిటీ దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తుందని పేర్కొన్నారు.

మున్నూరు కాపులకు అన్యాయం

కామారెడ్డి టౌన్ : రాష్ట్ర మంత్రి వర్గంలో మున్నూరుకాపు వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాల్సిందన్నారు. అన్ని అర్హతలున్న ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వకపోతే నిరసనలు తెలుపుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



లింగంపేట: రాంపల్లిలో సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మృగశిర కార్తె సందర్భంగా ఏటా గ్రామ దేవతలకు పండుగలు చేస్తారు. ఇందులో భాగంగా టెంకాయ కుస్తీ నుంచి వెండి కడియం కుస్తీ వరకు పోటీలు నిర్వహించారు. మల్లయోధులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. పోటీలను వీక్షించేందుకు వందలాది మంది తరలివచ్చారు.

టీపీసీసీలో జిల్లావాసులకు చోటు



చంద్రశేఖర్‌రెడ్డి



ఇంద్రకరణ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో జిల్లావాసులు ఇద్దరికి చోటు దక్కింది. భిక్కనూరు మండలానికి చెందిన ఇంద్రకరణ్‌రెడ్డితోపాటు కామారెడ్డి పట్టణానికి చెందిన గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిలకు ప్రధాన కార్యదర్శులుగా అవకాశం కల్పించారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ సోమవారం జాబితా విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన సీహెచ్ రాంభూపాల్ కూడా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.



జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



తాడ్వాయిలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



కూలిన కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రహరీ



కల్లాలి సమీపంలో పడిపోయిన చెట్టును తొలగిస్తున్న ఎస్సై భువనేశ్వర్



రామారెడ్డిలో విరిగిపడ్డ స్తంభం

పలకరించిన తొలకరి

దంచికొట్టిన వరుణుడు
- జిల్లా కేంద్రంలో జలమయమైన రోడ్లు
- నేలమట్టమైన ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రహరీ
- పలు మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రోహిణి కార్తె ప్రవేశంతోనే వరుణుడు కరుణించాడు. తొలకరి వర్షంతో పరవశింపజేశాడు. జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి, సోమవారం వేకువజామున ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా బీర్కూర్‌లో 98.3 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. జిల్లా కేంద్రంలో కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. భారీ వరద రావడంతో ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ ప్రహరీ నేలమట్టమైంది. కాకతీయనగర్, విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ, అశోక్‌నగర్, రుక్మిణికుంట, స్టేషన్‌రోడ్డు, నిజాంసాగర్ రోడ్డు, సిరిసిల్ల రోడ్డు తదితర ప్రాంతాలలో నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడ్డారు.



పెద్ద ఎక్లార సమీపంలో పారుతున్న వాగు, నిండిన చెక్ డ్యాం



తాడ్వాయి శివారులో విరిగి పడిన విద్యుత్ స్తంభం

జిల్లాలో వర్షపాతం వివరాలు..

మండలం	వర్షపాతం (మి.మీ.లో)	మండలం	వర్షపాతం
		మద్నూర్	57.5
బీర్కూర్	98.3	సోమూర్	56.0
తాడ్వాయి	79.8	బిచ్కుంద	52.8
జుక్కల్	77.0	డోంగ్లీ	54.0
కామారెడ్డి	75.5	నస్రుల్లాబాద్	49.8
సదాశివనగర్	73.5	గాంధారి	36.5
రామారెడ్డి	66.3	రాజంపేట	36.5



మద్నూర్ మార్కెట్ యార్డులో జొన్నలలోడ్‌తో ఉన్న లారీపై పడిన చెట్టు

బలమైన గాలులు, భారీ వర్షంతో నష్టం

జిల్లాలోని పలు ప్రాంతాలలో బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రేకుల షెడ్లు కొట్టుకుపోయాయి. సదాశివనగర్ మండల కేంద్రంలో అశోక్‌కు చెందిన రేకుల షెడ్డు కూలిపోయింది. తాడ్వాయి మండలంలో చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో 15 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. తాడ్వాయిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారికిరువైపులా చెట్లు విరిగి పడడంతో పోలీసులు వాటిని తొలగింపజేశారు. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రహరీ 40 మీటర్ల మేర కూలిపోయింది. నీటి ఒత్తిడి కారణంగానే ప్రహరీ కూలిపోయిందని కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. జుక్కల్ మండలం బస్వాపూర్, కల్లాలి గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై చెట్లు కూలిపోయాయి. వాటిని ఎస్సై భువనేశ్వర్ తొలగింపజేశారు. మద్నూర్, డోంగ్లీ మండలాల్లో వర్షం కురిసింది. పెద్ద ఎక్లార సమీపంలోని వాగు ప్రవహించింది.

రామారెడ్డిలో సోమవారం రాత్రి బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఐమాస్ట్ లైట్లు వంగిపోయాయి.

జొన్నల పైసలు వచ్చేదెప్పుడో?

- రెండు నెలలవుతున్నా అందని డబ్బులు
- ఇబ్బందిపడుతున్న రైతులు

పెద్దకొడప్‌గల్ : రైతులనుంచి జొన్నలు సేకరించిన సర్కారు.. ఇప్పటివరకు పైసా కూడా వారి ఖాతాలలో జమ చేయలేదు. దీంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు.

జిల్లాలో సుమారు 71 వేల ఎకరాలలో జొన్న పంట సాగయ్యింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 24 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులనుంచి పంటను సేకరించారు. పెద్దకొడప్‌గల్ మండలంలో 2,596 మంది రైతులు నుంచి 80,854 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి రైతులకు రూ. 27.25 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమై రెండు నెలలవుతున్నా ఇప్పటివరకు ఒక్క రైతుకు కూడా డబ్బులు చెల్లించలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండడంతో పెట్టుబడులకు చేతిలో డబ్బులు లేక ఇబ్బందిపడుతున్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడానికి, దున్నకాలకు డబ్బులు లేవని, జొన్నల పైసలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో జమ అవుతాయి

జొన్న పంట డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే రైతుల ఖాతాలలో జమ చేస్తాం.

– మహేష్ కుమార్, డీఎం, మార్క్‌ఫెడ్

నెల రోజులవుతోంది..



జొన్న పంట అమ్మి నెల రోజులు అవుతోంది. ఇప్పటి వరకు డబ్బులు జమ కాలేదు. విత్తనాలు, మందులు కొనడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే మా ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి.

– రామ్ సింగ్, రైతు, టీకారం తండా

విత్తనాలు కొనేదెలా..?



వానకాలం సీజన్ మొదలయ్యింది. జొన్నలు అమ్మి సుమారు రెండు నెలలవుతోంది. ఇంకా డబ్బులు రాలేదు. వానాకాలం సీజన్‌కు సంబంధించిన విత్తనాలు ఎలా కొనాలి. దున్నకాలను పైసలు ఎక్కడినుంచి తేవాలి. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– విఠల్, రైతు, కాస్లాబాద్

‘దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి’



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ టాస్క్‌ఫోర్స్ కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకునేలా గ్రామపంచాయతీల అధికారులు, సిబ్బందికి జిల్లా, మండల అధికారులు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. పాఠశాలల పరిసరాలను శుభ్రం చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు, డీపీవో మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్‌లో అక్రమాలు!

- వరుసగా వస్తున్న ఫిర్యాదులు
- మాజీ డీసీవో అక్రమాలను కప్పిపుచ్చినట్లు ఆరోపణలు
- గతంలోనే మంత్రి తుమ్మల విచారణకు ఆదేశించినప్పటికీ పట్టించుకోని యంత్రాంగం
- విచారణ అధికారులు సైతం కుమ్మక్కవుతున్నారంటూ విమర్శలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో ఇద్దరు మాజీ చైర్మన్ల సహకారంతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదంటూ పలువురు ప్రజాసంఘాల నాయకులు పోరాటానికి దిగారు. మాజీ చైర్మన్ల సహకారంతో మేనేజర్ నాగేష్, క్యాషియర్ ఆనంద్ రూ.2 కోట్ల మేర అక్రమాలకు పాల్పడినట్లు తాజాగా గత నెల 19న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వి ప్రభాకర్, సావెల గంగాధర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీరు గతంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సైతం ఫిర్యాదులు చేశారు. అక్రమాలపై విచారణ జరిపి సొమ్మును రికవరీ చేయాలని మంత్రి తుమ్మల 2024 నవంబర్ 2న ఉన్నతాధికారులను ఆదేశించారు. అయితే అంతకంటే ముందే అవకతవకలు, అక్రమాలపై అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశిస్తే అప్పటి జిల్లా సహకార అధికారి సింహాచలం అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ ముడుపులు తీసుకుని ఫైల్‌ను తొక్కిపెట్టినట్లు ఆరోపిస్తున్నారు. డీసీఎంఎస్ ద్వారా వివిధ వస్తువుల కొనుగోలు విషయంలో డీలర్ల వద్ద నుంచి అక్రమ పద్ధతిలో ఇన్వాయిస్‌లు తీసుకోవడంతో పాటు, కాంటాల మరమ్మతుల పేరిట దొంగలెక్కలు రాసి భారీగా బొక్కేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు 2023 శాసనసభ ఎన్నికల్లో సంఘం డబ్బులను ఎన్నికల ఖర్చు కోసం విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

■ ఇదిలా ఉండగా గతంలో క్యాషియర్ ఆనంద్ కామారెడ్డి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన విషయమై అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేశారు. అయితే ఆనంద్ కేవలం నెలరోజుల్లోనే తిరిగి విధుల్లో చేరాడు. పైగా ఏకంగా రెండు ఇంక్రిమెంట్లు సైతం పొందడం గమనార్హం. ఆనంద్ పాలకవర్గంలోని కొందరికి డబ్బులిచ్చి సస్పెన్షన్ ఎత్తేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకోకుండా పాలకవర్గం అడ్డుపడడమేమిటనే విమర్శలు వస్తున్నాయి. సహకార సంఘాల చట్టం 51, 52 మేరకు విచారణ పారదర్శకంగా చేపట్టి శాఖాపరంగా తగిన చర్యలు తీసుకుని నిధులు రికవరీ చేయాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేస్తున్నారు.

తూతూమంత్రంగా విచారణ

అక్రమ వ్యవహారాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రస్తుత జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మరోసారి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా వెళ్లిన అధికారి తూతూమంత్రంగా విచారణ నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులతోనే చర్చించి అన్ని వివరాలు వాళ్లకు చెప్పి కుమ్మక్కవుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, మంత్రులు తుమ్మల, జూపల్లి ప్రత్యేక దృష్టి సారించి అక్రమాలను నిగ్గుతేల్చి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్కారు కళాశాలలపై అనాసక్తి

- అడ్మిషన్ల కోసం ఇంటింటికి తిరుగుతున్న లెక్చరర్లు
- చేరేందుకు ఇష్టపడని విద్యార్థులు



నిజాంసాగర్ మండలంలో అడ్మిషన్ల కోసం విద్యార్థి ఇంటికి వెళ్లిన లెక్చరర్లు

నిజాంసాగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచడానికి లెక్చరర్లు ప్రయత్నిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ తమ కళాశాలలో చేరాలని కోరుతున్నారు. అయితే చాలామంది సర్కారు కళాశాలలో అడ్మిషన్ తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈనెల ఆరంభం నుంచే అడ్మిషన్ల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్లు ఇంటింటికి వెళ్తున్నారు.

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉండగా గతేడాది 3 వేల మంది ఇంటర్ విద్యనభ్యసించారు. అయితే జిల్లాలో కొత్తగా ఏర్పాటైన నిజాంసాగర్, బీర్కూర్, నాగిరెడ్డిపేట, బీబీపేట జూనియర్ కళాశాలతోపాటు బిచ్కుంద ఉర్దూ మీడియం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరైన వసతులు లేకపోవడం, లెక్చరర్లను నియమించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. పలు కళాశాలలను గతేడాది అడ్మిషన్లు ముగిసే సమయంలో ప్రారంభించారు. దీంతో ఆయా కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపలేదు.

ప్రభుత్వం ఆయా సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించింది. వారు విద్యార్థుల కోసం ఇంటి బాట పట్టారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అడ్మిషన్లు తీసుకోవడంపై లెక్చరర్లు, ప్రిన్సిపాల్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని కళాశాలల లెక్చరర్లు పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం ఇంటి బాట పట్టారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సంప్రదిస్తున్నారు. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు మాత్రం ఆసక్తి చూపడం లేదు. సర్కారు కళాశాలల్లో ఫలితాలు నిరుత్సాహ పరుస్తుండడంతో చాలామంది ప్రైవేట్ కళాశాలలకు వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నారు. నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎనిమిది మంది లెక్చరర్లు ఉన్నారు. ఇప్పటి వరకు కళాశాలలో పది మంది విద్యార్థులు మాత్రమే చేరడం గమనార్హం.

తల్లిదండ్రుల సహకారం అవసరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెకర్చర్లను నియమించాం. విద్యార్థులకు కావాల్సిన ల్యాబ్‌లు, ఫర్నిచర్ సమకూర్చాం. కళాశాలల్లో అడ్మిషన్లను పెంచేందుకు కృషి చేస్తున్నాం. దీనికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరం.

– షేక్ సలాం, జిల్లా ఇంటర్ విద్యాధికారి

భారీ అగ్ని ప్రమాదం

● రూ. కోటి ఆస్తి నష్టం ● వర్నిలో ఘటన



భవనం నుంచి వ్యాపిస్తున్న దట్టమైన పొగలు

వర్ని: మండల కేంద్రంలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామ శివారులో ఉన్న శ్రీ శక్తి ఎంటర్‌ప్రైజెస్‌లో ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గోడౌన్ పూర్తిగా దగ్ధమైంది. కూనిపూర్ క్యాంపునకు చెందిన కంటిపూడి రామకృష్ణ ఎనిమిది నెలల క్రితం సొంత భవనంలో ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభించారు. ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, స్టీల్, ఎలక్ట్రానిక్ తదితర సామగ్రికి ఉత్తర తెలంగాణ డీలర్‌గా ఉంటూ ఎంటర్‌ప్రైజెస్ నిర్వహిస్తున్నాడు. అగ్నిప్రమాదంలో వస్తువులతో పాటు భవనం పూర్తిగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న బోధన్ ,బాన్సువాడ, నిజామాబాద్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంతో రూ. కోటి విలువజేసే ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రామకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

ఎల్లారెడ్డిలో 46 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో తొలకరి వర్షం కురిసి అందరిని మురిపించింది. వేసవి తీవ్రతతో అలమటిస్తున్న జనాలకు భారీగా వర్షం కురవడంతో మనసుకు ఆహ్లాదాన్ని కలిగించింది. ఎల్లారెడ్డిలో సోమవారం 46 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం పాఠ్యపుస్తకాలను ఎంఈవో యోసెఫ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రస్తుతం మండలానికి 75 శాతం పాఠ్య పుస్తకాలు వచ్చాయని మిగతా 25 శాతం పుస్తకాలు పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా విద్యార్థులకు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని అంజని చౌరస్తా సమీపంలో 161వ జాతీయ రహదారిపై సోమవారం ఎస్సై మహేందర్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వైట్ ప్లేట్ ఉన్న ట్రాక్టర్లతో ఇసుక దందా నిర్వహించరాదని ట్రాక్టర్ యజమానులను హెచ్చరించారు. ఆరుగురు ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించారు. ఇసుక దందా నిర్వహించే ట్రాక్టర్ల యజమానులు టాక్సీ ప్లేట్ చేయించుకోవాలని తెలిపారు. ప్రతివాహనదారుడు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పిట్లంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు



నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో..



బాన్సువాడలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నేతలు

పత్రికా స్వేచ్ఛను హరిస్తోన్న ఏపీ ప్రభుత్వం

- 'సాక్షి' కార్యాలయాలపై దాడులు దారుణం
- కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికం
- నిరసన తెలిపిన జర్నలిస్టులు



మాచారెడ్డిలో..



కామారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : 'సాక్షి' మీడియాపై ఏపీ సర్కారు కక్షసాధింపు చర్యలను నిరసిస్తూ కామారెడ్డి జిల్లాలో జర్నలిస్టులు, ప్రజాసంఘాలు ఆందోళనలు చేపట్టాయి. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ పట్టణాలు, పిట్లం, మాచారెడ్డి, నస్రుల్లాబాద్ మండల కేంద్రాల్లో జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలిసి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రతికా స్వేచ్ఛను హరిస్తోందని ఆరోపించారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో సోదాలు, సాక్షి జర్నలిస్టులు, సాక్షి కార్యాలయాలపై దాడులు, సాక్షి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అక్రమ అరెస్టులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. కామారెడ్డిలో జరిగిన ఆందోళనల్లో సీనియర్ న్యాయవాదులు జి.జగన్నాథం, క్యాతం సిద్ధరాములు, సీపీఎం నాయకులు చంద్రశేఖర్, వెంకట్‌గౌడ్, ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగం, విద్యార్థి సంఘాల నేతలు అరుణ్, సురేశ్, విఠల్, నాగరాజు, స్టాలిన్ , వినోద్, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, జర్నలిస్టులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బాన్సువాడ, మాచారెడ్డి, నస్రుల్లాబాద్, పిట్లం మండల కేంద్రాల్లో జరిగిన ఆందోళనల్లో జర్నలిస్టులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొని నిరసన తెలిపారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణి కార్యక్రమానికి 50 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 50 వినతులు వచ్చాయి. వాటిలో భూ సమస్యలు, రెండు పడకల గదుల ఇళ్ల మంజూరు, రైతు భరోసా, పింఛన్ల మంజూరు లకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. తీసుకున్న చర్యలపై ఫిర్యాదుదారుడికి సమాచారం అందించాలని సూచించారు.

పాఠశాలలను సందర్శించండి..

జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి స్థితిగతులను తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరం ఉన్న చోట్ల పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. వివిధ శాఖల పనులపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, కామారెడ్డి ఆర్‌డీవో వీణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోడు పట్టాలకు పంట రుణాలివ్వాలి..

జిల్లాలో పోడు పట్టాలు పొందిన గిరిజన రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లబాన్ లంబాడా రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్ కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2006 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పోడు పట్టాలు పొందిన రైతులకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. పంట రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు గతంలో కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తు చేశారు. అయినా బ్యాంకర్లు ముందుకు రావడం లేదన్నారు. మరోసారి బ్యాంకర్లతో మాట్లాడి పోడు రైతులకు పంట రుణాలు అందేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): తప్పిపోయిన చిన్నారిని లింగంపేట పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోల్కంపేట గ్రామానికి చెందిన కొనసారి హేమలత ఆదివారం సాయంత్రం తన మూడేళ్ల కూతురితో లింగంపేటకు వచ్చింది. సరుకులు తీసుకునే క్రమంలో చిన్నారి తల్లి దగ్గర నుంచి తప్పిపోయింది. రాత్రి బస్టాండ్ ప్రాంతంలో చిన్నారి ఏడుస్తూ ఒంటరిగా ప్రయాణికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బ్లూకోల్ట్ సిబ్బంది దేవేందర్, కాశాగౌడ్ పాపను స్టేషన్‌కు తరలించి, ఫొటోను సామాజిక మాధ్యమంలో పెట్టారు. ఫొటో వైరల్ కావడంతో పోల్కంపేట వాసులు హేమలతకు సమాచారం ఇచ్చారు. పోల్కంపేట గ్రామస్తుల సమక్షంగా పోలీసులు పాపను తల్లికి అప్పగించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

భిక్కనూరు: మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో లక్ష్మి అమ్మవారి దేవాలయ నిర్మాణానికి సోమవారం గ్రామస్తులు భూమి పూజ చేశారు. గ్రామస్తులందరు విరాళాలను సేకరించి ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. అమ్మవారి దేవాలయ నిర్మాణంతో గ్రామం సుభిక్షంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన రైతు బట్టు భాస్కర్‌కు చెందిన గేదె సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వ్యవసాయ పొలం వద్ద గడ్డి మేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో గేదె మరణించినట్లు రైతు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఈవో శ్రావణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో సోమవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో భాగంగా రైతులు వివరాలను నమోదు చేశారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెలాఖరు వరకు ఆయా గ్రామాలలో గల రైతువేదిక కార్యాలయాలలో కొన సాగుతుందని పేర్కొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క



మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం : రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో బడి బాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి భవనాలను నవంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. స్కూల్ యూనిఫామ్స్‌ను వేగంగా అందించడానికి కృషి చేసినవారికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తూ నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియను గాంధీ జయంతి నాటికి పూర్తి చేయాలన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను రూపొందించాలని పెట్టుకున్న లక్ష్యం చేరుకోవడం కోసం మహిళలను భాగస్వాములను చేయడం కీలకమని సీఎస్ రామకృష్ణారావు పేర్కొన్నారు.

జిల్లాలో స్కూల్ యూనిఫామ్స్ స్టిచ్చింగ్‌ను 12 వ తేదీలోపు పూర్తి చేసి పంపిణీకి సిద్ధం చేస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మహిళా శక్తి భవన నిర్మాణాన్ని గడువులోగా పూర్తి చేస్తామన్నారు. నెలాఖరులోగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి స్థల సేకరణ పూర్తి చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చందర్, విక్టర్ పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్‌ను గడువులోగా కుట్టించలేకపోయిన విషయంలో అడిషనల్ డీఆర్‌డీవో మురళీకృష్ణ, డీపీఎం రమేష్‌లతో పాటు ఏపీఎంలు బాలపోచయ్య(బీబీపేట), శిరీష(పిట్లం), మనోహర్(తాడ్వాయి)లకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు.

క్రైం కార్నర్

ప్రాణాలు తీసుకున్న తండ్రీకొడుకులు

- దుబారా ఖర్చులు చేసి..
- మాణిక్‌భండార్‌లో ఘటన



సతీశ్ (ఫైల్)

మాక్లూర్: డబ్బులు ఉన్నప్పుడు దుబార ఖర్చులు చేశారు. కాలక్రమేనా.. కనీసం టీ తాగటానికి కూడా డబ్బులు లేక సతమతమయ్యారు. దానికి తోడు కొడుకు సతీశ్‌కు ఆరు నెలల క్రితం పక్షవాతం రావటంతో సేవలు చేయటానికి కూడా ఎవ్వరు లేకపోవడంతో.. 75 సంవత్సరాల వృద్ధుడైన తండ్రి ఆకుల చిన్న సాయిలు ఓపిక ఉన్నకాడికి సేవలు చేశాడు. చివరికి నీకు సేవలు చేయటం నాతో కావటం లేదు బిడ్డా... ఇక నేను ఏదైన మందు తాగి చచ్చిపోతాను అని తన అభిప్రాయాన్ని ఈ నెల 6 న కొడుకు సతీశ్‌తో చెప్పాడు. నీతోపాటు నేను కూడా అదే పని చేస్తా బాపూ అంటూ చెప్పి అదే రోజు విష గుళికలు తెప్పించుకుని నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాణిక్‌భండార్ గ్రామంలోని సొంత ఇంట్లోనే ఇద్దరూ కలిసి విషగుళికలు మింగారు. ఇద్దరూ వాంతులు చేసుకోవటంతో గమనించిన సాయిలు పెద్ద కుమారుడు సంతోష్ వెంటనే వారిద్దరిని ఆస్పత్రికి తరలించాడు. చికిత్సపొందుతూ సతీశ్ (32) సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తండ్రి ఆకుల చిన్న సాయిలు (75) ఆదివారం మృతి చెందాడు. రెండ్రోజుల వ్యవధిలో తండ్రీకొడుకులు మృతి చెందటంతో మాణిక్‌భండార్ గ్రామంలో విషాదం నెలకొంది. వ్యవసాయ భూమి అమ్మగా వచ్చిన సుమారు రూ. 90 లక్షలకు పైగా డబ్బులను సతీశ్ దుబారాగా ఖర్చు చేశాడు. తీరా చేతిలో చిల్లి గవ్వకూడా లేకుండాపోయింది. పైగా సతీశ్ మూడు వివాహాలు చేసుకున్నప్పటికీ ఒక్క భార్య కూడా కాపురం చేయలేదు. దీంతో తీవ్రమనస్తాపానికి గురై గత సంవత్సం తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. ఆరు నెలల క్రితం సతీశ్‌కు పక్షవాతం వచ్చి మంచం పట్టాడు. అప్పటి నుంచి తండ్రి సేవలు చేశాడు. డబ్బులు లేక ఆస్పత్రిలో వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

రైల్వే గేట్‌మన్ బలవన్మరణం

నవీపేట: మండలంలోని మహంతం రైల్వేగేటు గేట్‌మన్ విజేంద్రకుమార్ బైర్వ(29) సోమవారం వేకువజామున గేట్‌రూమ్‌లో బలవన్మరణానికి పాల్పడినట్లు రైల్వే ఎస్సై సాయరెడ్డి తెలిపారు. రాజస్తాన్‌లోని దసువా గ్రామానికి చెందిన విజేంద్రకుమార్ కొంతకాలంగా మహంతం రైల్వేగేట్ గేట్‌రూమ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం వేకువజామున ఫ్యాన్ సీలింగ్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్ హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతికి గల కారణాలు తెలియలేదన్నారు.

పుల్కల్‌లో వివాహిత..



బిచ్కుంద: మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన చాకలి సునీత(38) ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సునీత భర్త గంగాధర్ కొంతకాలం క్రితం చనిపోవడంతో ఆర్థిక సమస్యలు పెరిగి నిత్యం ఆవేదనలో ఉండేదన్నారు. మగ దిక్కు లేదనే ఆవేదనతో కుటుంబపోషణ భారమై ఆత్మహత్యకు పాల్పడింది. మామ చాకలి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ..

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన హోలియా లక్ష్మి అలియాస్ బాల్‌గిర్ లక్ష్మి(44) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. లక్ష్మి ఇటీవల ఒక ఇంటిని కొనుగోలు చేసింది. ఇన్‌స్టాల్‌మెంట్‌లో భాగంగా కొడుకు రోహిత్ కొన్ని డబ్బులు పంపించాడు. మిగతా డబ్బులు పంపాలని అడగగా కొడుకు స్పందించలేదు. ఇన్‌స్టాల్‌మెంట్ డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో మనస్తాపానికి గురైన లక్ష్మి ఇంట్లో ఫ్యాన్‌కి చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

- నిందితులు మహారాష్ట్రకు చెందిన పార్థీగ్యాంగ్ సభ్యులు
- నలుగురు అరెస్ట్, పరారీలో మరొకరు
- మారణాయుధాలు, సొత్తు రికవరీ
- అదనపు ఎస్పీ నరసింహారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ నరసింహారెడ్డి

కామారెడ్డి క్రైం: ఆరు నెలలుగా కత్తులతో బెదిరించి జాతీయ రహదారుల వెంబడి దోపిడీలు, తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్న మహారాష్ట్రకు చెందిన పార్థీ గ్యాంగ్ ముఠాను గాంధారి పోలీసులు పట్టుకున్నారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న నలుగురిని అరెస్ట్ చేయగా, మరొకరు పరారీలో ఉన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి వివరాలు వెల్లడించారు. ఇటీవల గాంధారి పోలీస్ స్టేషన్‌లో ఓ దోపిడీ కేసు నమోదైంది. ఇలాంటి కేసులు క్రమం తప్పకుండా నమోదు అవుతుండటంతో ఎస్పీ రాజేశ్ చంద్ర సూచన మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో దొంగలను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, కొన్ని ఆధారాలతో దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను పార్థీ గ్యాంగ్ ముఠాగా గుర్తించారు. సోమవారం గాంధారి మండలం మొండిసడాక్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకున్నారు. వారిని విచారించగా దొంగతనాల వ్యవహారం బయటపడింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముఖేడ్ ప్రాంతానికి చెందిన నాందేవ్ అలియాస్ రామక్రిష్ణ భోంస్లే, భాస్కర్ చౌహాన్, క్రిష్ణబాబు షిండే, రాథోడ్ అజిత్ రమేశ్ ముఠాగా ఏర్పడి దారి దోపిడీలు, తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు చేస్తున్నారు. వారికి గజానంద్ రామారావు ఆడె అనే వ్యక్తి రిసివర్‌గా వ్యవహరిస్తున్నాడని విచారణలో తేలింది. నిందితుల్లో భాస్కర్ చౌహాన్ పరారీలో ఉండగా మిగిలిన నలుగురిని అరెస్ట్ చేశారు. 3 తులాల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలు, 2 కత్తులు, ఇనుప రాడ్డు, టార్చి లైట్లు, ఇతర వస్తువులు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కామారెడ్డి జిల్లాలోని గాంధారి, బాన్సువాడలో 9 కేసులు ఉండగా నిజామాబాద్, నిర్మల్ పోలీస్ స్టేషన్‌లలో కూడా పదుల సంఖ్యలో కేసులు ఉన్నట్లు తెలుస్తుందని ఏఎస్పీ తెలిపారు. మహారాష్ట్రలోని ఉద్గిర్ రూరల్, నీలంగా పీఎస్‌లలో హత్య, హత్యాయత్నం కేసులు నమోదైనట్లు వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని పేర్కొన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ శ్రీనివాస్, సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, రంజిత్, ఉస్మాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది గణపతి, శ్రీనివాస్, రాజేందర్, శ్రావణ్, లక్ష్మీకాంత్, స్వామి, మైసయ్య, రవిలను అభినందించారు.

మోసగించిన యువతి రిమాండ్

- రూ. 3 లక్షల 80 వేలు స్వాధీనం



రికవరీ చేసిన డబ్బులతో సీఐ వెంకట నారాయణ

బోధన్‌టౌన్(బోధన్): అనాథనని నమ్మించి దంపతుల అకౌంట్‌లో నుంచి రూ. 7,49,500 కాజేసిన యువతిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలి వద్ద నుంచి రూ. 3 లక్షల 80 వేలు సాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వెంకట్ నారాయణ వివరాలు వెల్లడించారు. ఏపీలోని గుంటూరుకు చెందిన పబ్బులేటి సోని ప్రత్యూష గత నెల 30న బోధన్ పట్టణానికి వచ్చింది. యూనియన్ బ్యాంకులో నాగన్‌పల్లికి చెందిన శ్రీనివాస్ దంపతులకు తాను అనాథనని, నా అకౌంట్ పనిచేయడం లేదని, అకౌంట్లో రూ.10 లక్షలు వరకు ఉన్నాయని అవి మీ అకౌంట్లో వేస్తా తీసి ఇవ్వాలని కోరింది. అందుకు దంపతులు ఒప్పుకొని, రాత్రి యువతిని వారి ఇంటికి తీసుకెళ్లారు. అకౌంట్లో డబ్బులు వేస్తా.. వివరాలు ఇవ్వాలని అడగగా, శ్రీనివాస్ భార్య అకౌంట్ నంబర్, ఏటీఎం కార్డు, పిన్ నంబర్‌తోపాటు సిమ్ కార్డు ఇచ్చారు. దీంతో వారికి తెలియకుండా అకౌంట్ నుంచి రూ. 7లక్షల 49 వేల 500 లు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకొని, ఉదయం ఐరేండ్ల నరేశ్ అనే వ్యక్తి సహాయంతో బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసుకొని పారిపోయింది. శ్రీనివాస్ దంపతులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పరారైన యువతిని సోమవారం పట్టుకొని రూ. 3 లక్షల 80 వేల నగదు తోపాటు మూడు ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో నిజామాబాద్‌లోని త్రి టౌన్, నందిగామ, సైబరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాదాపూర్‌లో ఇదే తరహా చీటింగ్‌కు పాల్పడి సోని ప్రత్యూష జైలుకు వెళ్లిందని సీఐ తెలిపారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఇతరులను నమ్మొద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పుప్పాల బుచ్చక్క(108) సోమవారం మృతి చెందింది. వారం రోజుల క్రితం వరకు ఎవ్వరిపై ఆధారపడకుండా ఆమె పనులు ఆమెనే చేసుకుంది. బుచ్చక్కకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉండగా, ఆమె మూడు తరాల వారిని చూసింది.

డిక్కీలోంచి రూ.లక్ష మాయం

బాన్సువాడ : బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన బొప్పిడి సాయిరెడ్డి అనే వ్యక్తి స్కూటీ డిక్కీలోంచి రూ. లక్ష మాయమైనట్లు సీఐ అశోక్ తెలిపారు. సోమవారం యూనియన్ బ్యాంకులో సాయిరెడ్డి రూ.లక్ష నగదు డ్రా చేసుకొని స్కూటీ డిక్కీలో పెట్టి డెయిలీ మార్కెట్‌లో కూరగాయలు కొనేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా డిక్కీలో ఉండాల్సిన రూ. లక్ష నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాత, మనుమడు మృతి

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్తుల ఆందోళన





సిద్ధిరాములు, శేయాంక్ (ఫైల్)

రాజంపేట : మండల కేంద్ర సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం (టీవీఎస్ ఎక్సెల్) ఢీకొని తాత, మనుమడు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బస్వన్నపల్లికి చెందిన సిద్ధిరాములు(50), మనుమడు శేయాంక్(4) టీవీఎస్ ఎక్సెల్‌పై రాజంపేటలోని పీహెచ్‌సీకి వెళ్తున్నారు. గుండారం నుంచి కామారెడ్డికి వస్తున్న ఆర్టీసీ బస్సు రాజంపేట సమీపంలో టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టింది. దీంతో ఎక్సెల్‌పై ఉన్న ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న బస్వన్నపల్లి గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై ఆందోళన చేశారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. కామారెడ్డి డిపో సీఐ లింగమూర్తి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కామారెడ్డి ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.